క్లుప్తంగా

నేడు ప్రజావాణి

కొడంగల్: మండల పరిధిలోని భూముల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే సోమవారం ఉదయం కొడంగల్‌తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆదివారం తహసీల్దార్ బుచ్చయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

దోమ మండలంలో..

దోమ: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ షాహెదబేగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు కార్యాలయానికి వచ్చి అర్జీ పెట్టుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు రాకంచర్లకు ఎమ్మెల్యే

పూడూరు: మండల పరిధిలోని రాకంచర్ల యోగానందలక్ష్మీనరసింహస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు సోమవారం ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి రాకంచర్లకు వస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ జాజుల నర్సింహులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగలరని చైర్మన్ కోరారు.

2నుంచి బ్రహ్మోత్సవాలు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి శివారులోని శ్రీపార్వతీపరమేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 2 నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరమేశ్వరుని గుట్టగా పేరుగాంచిన ఈ పుణ్య స్థలంలో ప్రతియేటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈసారి శోభకృత్ నామ సంవత్సర చైత్రశుద్ధ ద్వాదశి ఆదివారం నుంచి మంగళవారం వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

మురుగుకాల్వల మరమ్మతుల పరిశీలన

కుల్కచర్ల: పారిశుద్ధ్య కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని కుల్కచర్ల సర్పంచ్ సౌమ్యారెడ్డి అన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో నూతన మురుగుకాల్వల ఏర్పాటు, పురాతన మురుగు కాల్వల మరమ్మతు పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం పూర్తికావస్తున్న నేపథ్యంలో గ్రామ పరిధిలో అత్యవసరమైన ప్రాంతాల్లో మురుగుకాల్వల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాట్యం



చిన్నారి నృత్య ప్రదర్శన

కొడంగల్: పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి బాలాజీ ఆడుతా పాడుతా తీయగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు చేసిన నాట్యం ఆకట్టుకుంది. ప్రతిభచాటిన చిన్నారులను నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో నందారం శ్రీనివాస్, మురహరి వశిష్ట, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రవి

మర్పల్లి: మండల పరిధిలోని కోట్‌మర్పల్లి గ్రామంలోని బక్కప్ప గుడి కాలనీలో ఉపాధి హామీ పథకం కింద రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆ కాలనీ వార్డు మెంబర్ తమ్మలి రవి ఆదివారం ప్రారంభించారు. తమ కాలనీలో సీసీ రోడ్డు పనులు చేపట్టాలని సర్పంచ్ విజయలక్ష్మి రాచన్న దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించి సిమెంట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు తైసీన్, వార్డు మెంబర్లు జైహింద్‌రెడ్డి, రమేష్‌గౌడ్ గ్రామస్తులు జగన్ రెడ్డి, మక్బూల్ తదితరులు ఉన్నారు.

బస్టాండ్ నిర్మించండి సారూ..

తాండూరు రూరల్: మండల పరిధిలోని గోనూర్ గేటు వద్ద బస్టాండ్ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గోనూర్‌తో పాటు వీర్‌శెట్టిపల్లి గ్రామ ప్రజలు నిత్యం వివిధ పనుల నిమిత్తం తాండూరుకు వెళ్తుంటారు. గోనూర్ గేటు వద్ద బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండలో నిలబడుతున్నారు. ఎండకు ఎండి, వానకు తడవాల్సి వస్తోందని ప్రయాణికులు వాపతోతున్నారు. విద్యార్థులు, వృద్ధుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కనీసం చెట్టు నీడ కూడా లేకుండా ఎండలో నిలబడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గోనూర్ గేటు వద్ద బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

'పది'పై ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- మండలంలో వార్షిక పరీక్షలు రాయనున్న 497 మంది విద్యార్థులు
- వందశాతం ఫలితాలు సాధిస్తామంటున్న ఉపాధ్యాయులు



దాదాపూర్ పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో పదో తరగతి విద్యార్థులు

దోమ: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధించే దిశగా విద్యాశాఖ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో రోజూ పది పరీక్షల కోసం విద్యార్థులు ప్రిపేర్ అయ్యేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న విషయంలో తెలిసిందే. ఈ నేపథ్యంలో మంయి ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగుతున్నాయి. మండల వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో మొత్తం 497 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది అధిక ఉత్తీర్ణత శాతం పెంచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా విద్యార్థులు దేనిలో వీక్‌గా ఉన్నారో తెలుసుకుని ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు.

సందేహాల నివృత్తి..

పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రత్యేక తరగతులు మాత్రం ఉపాధ్యాయులు కొనసాగిస్తూనే ఉన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి 12:30 నిమిషాల వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగుతుండగా మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2:30 నిమిషాల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుల్లో కీలక అంశాలకు సంబంధించిన ప్రశ్న, జవాబులు ముద్రించి అభ్యాసన స్టడీ మెటీరియల్స్‌ను విద్యార్థులకు అందజేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులే లక్ష్యంగా ఎంపిక చేసుకొని వారి సందేహాల నివృత్తికి ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు.

పట్టుదలతో చదవుతున్నా



ఈ యేడాది పది పరీక్షలకు సిద్ధమవుతున్నాను. పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులతో సబ్జెక్టుల మీద పూర్తి పట్టు వస్తోంది. అధిక మార్కులు తెచ్చుకునేలా శ్రద్ధ వహిస్తున్నారు. ఒంటి పూట బడులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల చొరవతో ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. ప్రతి రోజు అర్థవంతంగా పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. మంచి ఫలితాలు సాధిస్తా.

– సంతోషి, పదో తరగతి విద్యార్థి

సందేహాల నివృత్తికి దోహదం



ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండటంతో సబ్జెక్టుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసుకుంటున్నాం. ఎక్కువ మార్కులు సాధించాలనేలక్ష్యంతో పోటీపడి చదువుకుంటున్నాం. ఉపాధ్యాయులు తీసుకుంటున్న ప్రత్యేక తరగతులతో మంచి మార్కులు వస్తాయనే నమ్మకం కలిగింది.

– సైఫుద్దీన్, పదో తరగతి విద్యార్థి

ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి



పదోతరగతి విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకొని వారి సందేహాలను ఎప్పటికప్పుడూ నివృత్తి చేస్తున్నాం. అర్థం కాని బోధనాంశాలను అర్థమయ్యేలా వివరిస్తూ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం.

– శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు, దాదాపూర్ ప్రభుత్వ పాఠశాల

శాంతిభద్రతలకు ప్రజా సహకారం తప్పనిసరి

సీఐ అప్పయ్య

ధారూర్: శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం కీలకమని ధారూర్ సీఐ అప్పయ్య అన్నారు. మండలంలోని కేరెళ్లి గ్రామంలో ఆదివారం వివిధ కమ్యూనిటీల నాయకులతో సీఐ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు వాటిపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలన్నారు. ఎస్ఐ సంతోష్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి..

ధారూర్: పతి ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని ధారూర్ సీఐ అప్పయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధారూర్, బంట్వారం, కోట్‌పల్లి మండలాల ప్రజలు అధికంగా రోడ్డు ప్రమాదాల బారినపడుతూ ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. మృతుల్లో తలకు గాయాలై చనిపోయినవారే ఎక్కువ శాతం ఉన్నారన్నారు. ఏప్రిల్ మొదటి నుంచి హెల్మెట్ ధరించని వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.



ధారూర్: సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అప్పయ్య

నేడు తైబజార్ వేలం

ధారూరు: ధారూరు తైబజార్ బహిరంగ వేలం పాటను సోమవారం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఉప్పు చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శనివారం నిర్వహించే కూరగాయల మార్కెట్లో కూరగాయల విక్రేతల నుంచి నిర్ణీత రుసుమును వసూలు చేసుకునేందుకు ఈ వేలం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి మార్చి 31, 2024 వరకు తైబజార్ కాలపరిమితి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉందయం 10:30 గంటలకు వేలంపాట ప్రారంభమౌతుందని.. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందని, వీటిని ధరావత్తు కింద పరిగణిస్తామని చెప్పారు. వేలంలో పాల్గొనే వారికి ఏలాంటి పంచాయతీ బకాయిలు ఉండరాదని సూచించారు.

31న మన్నేగూడ తైబజార్ వేలం

పూడూరు: ఈనెల 31న మన్నేగూడ తైబజార్ వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మాణిక్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మన్నేగుడ పంచాయతీ కార్యాలయంలో ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహించడం జరుతుందని తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు రూ.పదివేలు చెల్లించాలని తెలిపారు.

గిర్మాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పెద్దేముల్: మండల పరిధిలోని గిర్మాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం డాక్టర్ మక్సూద్ పీపుల్స్ మెమెరియల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్రామంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయమ్మ, ఉపసర్పంచ్ ఎల్లప్ప, పాస్టర్ ప్రకాష్, నాయకులు రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీ అమ్మవారు

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని సిద్దనొంపు మార్గంలో వెలసిన శ్రీనందవరం చౌడేశ్వరీ మాత జ్యోతి ఉత్సవాలు రెండు రోజులుగా అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం జ్యోతి ఉత్సవాలను నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల నేపథ్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవారం పెరుగుబసంతం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఉత్సవాలు..

మర్పల్లి: మండల పరిధిలోని ధామస్తాపూర్ గ్రామంలో ఆంజనేయ స్వామి ధ్వజ స్తంభ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు కనులపండుగగా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం ధ్వజ స్తంభానికి పూజారులు ప్రత్యేక పూజలు చేసి జలాభిషేకం చేశారు. సాయంత్రం భగవద్గీత పారాయణం చేశారు. రాత్రి దీపారాధనతో పాటు భజన కార్యక్రమాలు చేపట్టారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లారీ ఓనర్ల సమస్యలు పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: లారీ ఓనర్స్ అసోషియేషన్ వారు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కారిస్తామని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాండూరు లారీ ఓనర్స్ అసోషియేషన్ నూతన కమిటీ పదవీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి హాజరయ్యారు. అసోషియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ ఘనీ, నర్సింహారెడ్డితో పాటు కమిటీ కార్యవర్గసభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాండూరు పట్టణంలో లారీల పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో లారీ ఓనర్స్ ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకోసం శివారులో త్వరలో లారీ పార్కింగ్ పనులు మొదలు పెడతామన్నారు. ఇంకా ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, లారీ అసోసియేషన్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ యశోద, నాయకులు

దోమ: ఛత్రపతి శివాజీ అంటే వీరత్వానికి ప్రతీక అని సర్పంచ్ యశోద అన్నారు. ఆదివారం దోమ మండల పరిధిలోని పాలేపల్లి గ్రామంలో గ్రామస్తులు, యువతతో కలసి ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు సర్పంచ్ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ ప్రదీప్ రెడ్డి, ఉపసర్పంచ్ రమేశ్, మాజీ సర్పంచ్ నర్సింహులు గౌడ్, ఈనాడు జర్నలిస్ట్ నర్సింహులు, గ్రామస్తులు తిరుపతయ్య సాగర్, మామిళ్ల నర్సింహులు, దస్తయ్య, కొత్త అంజిలయ్య, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పల్లెపల్లెకూ పైలెట్'

యాలాల: మండలంలోని 'పల్లెపల్లెకు పైలెట్' కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలో 27 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. రాస్నం, గంగాసాగర్, సంగాయిపల్లితండా, పగిడియాల, బాగాయిపల్లి, అచ్యుతాపూర్, ముద్దాయిపేట, సంగాయగుట్టతండా, తొప్పెర్లగడ్డ తండాల్లో కొనసాగుతుందని ఎంపీపీ తెలిపారు.

గిరిజన సమస్యలపై పోరాటం



గ్రామస్తులతో రాహుల్ నాయక్

అఖిల భారత బంజారా సేవా సంఘం

కుల్కచర్ల: గిరిజనుల అభ్యున్నతికి అఖిల బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో కృషిచేస్తున్నామని అఖిల భారత బంజారా సేవా సంఘం పరిగి నియోజకవర్గ అధ్యక్షులు రాహుల్ నాయక్ అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండలం హన్మ్యానాయక్ తండాలో ఆయన పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం తండాలను ప్రత్యేక పంచాయతీలుగా మార్చినప్పటికీ నిధులు లేక పంచాయతీలు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని అన్నారు. నూతన పంచాయతీల(తండా)కు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఇకపై పరిగి నియోజకవర్గవ్యాప్తంగా గిరిజనుల సమస్యల పోరాటం చేస్తానమ్నారు. ఈ కార్యక్రమంలో చందర్, నీల్యానాయక్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్షకు తరలిన కాంగ్రెస్ నాయకులు

పరిగి: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటును నిరసిస్తూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గాంధీ భవన్‌లో ఆదివారం ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష చేపట్టారు. దీక్షకు మద్దతు తెలిపేందుకు పరిగి నియోజకర్గంలోని ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బయలుదేరి వెళ్లారు. ముందుగా పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందన్నారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రతిపక్షమే లేకుండా చేయాలని కుట్రలు చేస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీజేపీ అధికార మదంతో ఇష్టానుసారంగా చేస్తూ ఉంటే ఊరుకోమన్నారు. రాహుల్‌గాంధీకి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, ఆయా మండలాల అధ్యక్షులు పరశురాంరెడ్డి, ఆంజనేయులు, విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు చిన్ననర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

ఎన్‌ఎస్‌ఎస్ సేవలు అభినందనీయం



గౌతపూర్‌లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



యాలాల: విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సర్పంచ్ భీమప్ప

సర్పంచ్ భీమప్ప, ఎంపీటీసీ గరివప్ప

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతాపూర్‌లో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం కొనసాగుతోంది. పీపుల్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆదివారం గౌతపూర్‌లో మొక్కలు నాటారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవలో ముందుండాలని సర్పంచ్ రాజప్ప అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొగ్రాం అధికారులు రవీందర్‌రెడ్డి, మంజులబాయ్, స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సేవాభావం..

యాలాల: జాతీయ సేవా పథకం ద్వారా కళాశాల విద్యార్థుల్లో సేవాభావం పెరుగుతుందని అగ్గనూరు సర్పంచ్ భీమప్ప, ఎంపీటీసీ గరివప్ప అన్నారు. గ్రామంలో గత ఆరు రోజులుగా సింధూ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపు ముగింపు సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్, ఎంపీటీసీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత వారం రోజులుగా విద్యార్థులు గ్రామంలో పారిశుద్ధ్య, హరితహారం, రక్తదాన శిబిరం లాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. కళాశాల ప్రిన్సిపా విజయాదేవి మాట్లాడుతూ.. వారం రోజులుగా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల సేవాగుణం అభినందనీయమన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌లో పాల్గొన్న విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు రంగారావు, వైస్ ప్రిన్సిపాల్ రఘునందన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం అధికారి విశ్వనాథ్ గౌడ్, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీశైలం తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెద్దేముల్: మండల పరిధిలోని గాజీపూర్ గ్రామానికి చెందిన పసుల సాయిబన్న(70) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గాజీపూర్ మురళీకృష్ణ ఆదివారం అంత్యక్రియల నిమిత్తం మృతుడి కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఈడ్గి లక్ష్మయ్య గౌడ్,పసుల అంజిలప్ప, జున్ముల సురష్, అంజి,రవిలు ఉన్నారు.

వడ్లనందు ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

అనంతగిరి: వికారాబాద్ మండలం మైలార్‌దేవరాంపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బాలయ్య మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వడ్లనందు ఫౌండేషన్ చైర్మన్ బీఆర్‌ఎస్ నాయకుడు వడ్లనందు ఆదివారం గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబానికి రూ.12వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, దారూర్ వైస్ ఎంపీపీ విజయ్‌నాయక్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ రమేష్‌కుమార్, కౌన్సిలర్ చందర్‌నాయక్, ఎంపీటీసీ బసప్ప, సర్పంచ్ పరమేష్, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, రాజు, సంగమేష్ గ్రామస్తులు వీరేశం తదితరులు పాల్గొన్నారు.

దోమ మండలంలో..

దోమ: మండల పరిధిలోని మోత్కూర్, ఐనాపూర్, ఉదన్‌రావుపల్లి, దొంగ ఎన్కేపల్లి, మైలారం గ్రామాల్లో గ్రామానికి చెందిన పుల్ల నర్సమ్మ, శ్రీజంగం పాపయ్య, ఎరుకలి మల్లేశం, సోనీబాయి, జోగు సాయన్న ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్‌రెడ్డి వారి అనుచరులతో బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు.

వసతి గృహాలకు ఆదరణ కరువు

- మూతపడుతున్న ఎస్సీ, బీసీ వసతి గృహాలు
- వృథాగా హాస్టల్ భవనాలు
- రూ.లక్షల్లో ప్రజాధనం వృథా



తొర్మామిడిలో మూతపడిన ఎస్సీ హాస్టల్ భవనం

బంట్వారం: విద్యార్థుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వసతి గృహం మూతపడింది. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనం వృథాగా పడి ఉంది. బంట్వారం మండల పరిధిలోని తొర్మామిడి గ్రామంలో 2009లో ఎస్సీ హాస్టల్ భవనం ప్రారంభించారు. ఇందుకుగాను అప్పట్లో బీఆర్‌జీఫ్, జెడ్పీ నిధులు అవసరమైన మేరకు వెచ్చించారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే వసతి గృహం ప్రారంభించిన ఏడాది కాలంలోనే మూతపడింది. ఊరికి కిలో మీటరు దూరంలో భవనం కట్టించడంతో విద్యార్థులు హస్టల్లో ఉండేందుకు అప్పట్లో ఇష్టపడలేదు. చేసేదేమీ లేక అధికారులు కూడా కొన్నాళ్లకే హాస్టల్‌ను మూసివేశారు. భవనం ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉండటంతో ప్రస్తుతం బూత్ బంగ్లాను తలపిస్తుంది. అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

బంట్వారంలోనూ అదే పరిస్థితి..

మండల కేంద్రం బంట్వారంలోని బీసీ హాస్టల్ పరిస్థితి కూడా అలాగే ఉంది. విద్యార్థులు లేరనే సాకుతో సంబంధిత అధికారులు నాలుగేళ్ల కిందట బీసీ హస్టల్‌ను మూసివేశారు. 2005 సంవత్సరంలో మత్స్యశాఖ కట్టించిన పక్కా భవనం కొన్నాళ్లకే కూలే స్థితికి చేరడంతో అప్పట్లో అద్దె భవనంలోకి మార్చారు. చుట్టు పక్కల గ్రామాల విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ బాగానే చదువుకనేవారు. ఉన్నట్టుండి బీసీ వెల్ఫేర్ అధికారులు 2017 సంవత్సరంలో ఈ హాస్టల్‌ను సైతం ఎత్తివేశారు.

కోట్‌పల్లి ఎస్సీ హాస్టల్ పరిస్థితీ అంతే..

పిల్లలు లేరనే కారణంతో కోట్‌పల్లి ఎస్సీ హస్టల్‌ను కూడా చాలా కాలం కిందట ఎత్తివేశారు. కోట్‌పల్లి కొత్త మండలంగా ఏర్పడటంతో హాస్టల్ భవనాన్ని ప్రభుత్వ కార్యాలయాలుగా వాడుకుంటున్నారు.

హాస్టళ్లకు తగ్గిన ఆదరణ..

గతంలో బీసీ, ఎస్సీ వసతి గృహల్లో సీటు దొరకాలంటేనే కష్టంగా ఉండేది. రానురాను హాస్టళ్లకు ఆదరణ తగ్గిపోయింది. విద్యార్థుల సంఖ్య పడిపోవడంతో అక్కడక్కడ కనిపిస్తున్న హాస్టళ్లు కూడా మూతపడే స్థాయికి చేరుకున్నాయి. గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు వచ్చిన నాటి నుంచి బీసీ, ఎస్సీ హాస్టళ్లలో ఉండేవారు కరువయ్యారు. నానాటికి మూతపడే దశకు చేరుకుంటున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీహెచ్‌ఎస్ స్కూళ్ల పరిస్థితి కూడా అలాగే తయారైంది. విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. విద్యార్థులంతా గురుకులాలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో చేరేందుకు ఇష్టపడుతున్నారు.